# మేజోళ్ళపై మసహ్ చేయటం

# ٥ - بَابُ الْمَسْحِ عَلَى الْخُفَّيْنِ

53. హజ్రత్ ముగీరా బిన్ షూబ (రజి) తెలిపారు : నేను దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) వెంట ఉన్నాను. ఆయన (స) వుజూ కోసం ఉపక్రమించ గానే నేను ఆయన మేజోళ్లను తీయ డానికి ముందుకొచ్చాను. అప్పుడాయన (స) ఇలా పలికారు : "వదులు. నేను మేజోళ్లు తొడిగినప్పుడు వుజూతో ఉన్నాను." ఆ తరువాత ఆయన (సఅసం) వాటిపై మసహ్ చేశారు.

(బుఖారీ, ముస్లిం)

(٥٣) عَنِ الْمُغِيرَةِ بْنِ شُعْبَةَ رَضِيَ اللّٰهُ تَعَالَى عَنْهُ قَالَ: كُنْتُ مَعَ النَّبِيِّ ﷺ، فَتَوَضَّأَ فَأَهْوَيْتُ لِأَنْزِعَ خُفَّيْهِ، فَقَالَ: «دَعْهُمَا فَإِنِّي أَدْخَلْتُهُمَا طَاهِرَتَيْنِ» فَمَسَحَ عَلَيْهِمَا. مُتَّفَقٌ عَلَيْهِ.

### సారాంశం

ఈ హదీసు ద్వారా స్పష్టమయ్యేదేమిటంటే వుజూ చేసివున్న స్థితిలో మేజోళ్లు తొడిగి ఉంటేనే వాటిపై మసహ్ చేయటం ధర్మసమ్మతం అవుతుంది. ఈ సంఘటన తబూక్ యుద్ధ సందర్భంగా ఫజ్ర్ నమాజ్ సమయంలో ఎదురయిందని అబూ దావూద్ మరియు మువత్తా ఇమామ్ మాలిక్‌లలో వివరించబడింది.

(٥٤) وللأَرْبَعَةِ عَنْهُ إلاَّ النَّسَائِيَّ: أَنَّ النَّبِيَّ ﷺ مَسَحَ أَعْلَى الْخُفِّ وَأَسْفَلَهُ. وَفِي إِسْنَادِه ضَعْفٌ.

54. 'నసాయి' లోనే గాకుండా మిగిలిన సునన్ యొక్క నాలుగు గ్రంథాలలో కూడా ముగీరా బిన్ షూబ (రజి) గారి చేతనే ఈ విధంగా ఉల్లేఖించబడింది : "దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) మేజోళ్లపైనా, క్రింద - రెండు వైపులా మసహ్ చేశారు." (ఈ ఉల్లేఖనం అంతగా ప్రామాణికమైనది కాదు).

### సారాంశం

మేజోళ్ల పైనా, క్రింద - రెండు వైపులా మసహ్ చేయటం అవసరమని ఈ హదీసు ద్వారా తెలియవస్తోంది. అయితే ఈ ఉల్లేఖనం బలహీనమైనది. రాబోయే ప్రామాణికమైన హదీసుకు ఇది విరుద్ధంగా ఉన్నది.

(٥٥) وعَنْ عَلِيٍّ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ قَالَ: لَوْ كَانَ الدِّينُ بِالرَّأْيِ لَكَانَ أَسْفَلُ الْخُفِّ أَوْلَى بِالْمَسْحِ مِنْ أَعْلاَهُ، وَقَدْ رَأَيْتُ رَسُولَ اللهِ ﷺ يَمْسَحُ عَلَى ظَاهِرِ خُفَّيْهِ. أَخْرَجَهُ أَبُو دَاوُدَ بِإِسْنَادٍ حَسَنٍ.

55. హజ్రత్ అలీ (రజి) ఉల్లేఖించారు : "ఒకవేళ ధర్మం పునాదే గనక అభిప్రాయాలపై, హేతువుపై ఆధారపడి ఉంటే మేజోళ్ల పైభాగానికి బదులు క్రింది భాగానికి మసహ్ చేయటం ఎక్కువ సమంజసంగా భావించబడేది. అయితే దైవప్రవక్త (సఅసం) తన మేజోళ్ల పైభాగాన మసహ్ చేయటం నేను ఖుద్దుగా చూశాను." (అబూ దావూద్ దీనిని ప్రామాణికమైన రీతిలో ఉల్లేఖించారు).

### సారాంశం

దీనిభావం ఏమిటంటే ధర్మాదేశాలు దైవ సంకేతంపై ఆధారపడి ఉంటాయిగాని బుద్ధీ వివేకాలపై కావు. బుద్ధిపై, హేతువుపై గనక ఇవి ఆధారపడి ఉన్నట్లయితే మేజోళ్ల పైభాగాన

మసహ్ చేయాలని ఎన్నటికీ ఆజ్ఞాపించబడేది కాదు. మేజోళ్ల అడుగు భాగాన మాత్రమే మసహ్ చేయాలని ఆదేశించబడేది. ఎందుకంటే అడుగు భాగమే అశుద్ధతకు, మలినానికి లోనై ఉంటుంది. కాని హదీసు హేతువుకు విరుద్ధంగా ఉంది. మూలాంశం స్పష్టంగా ఉన్నప్పుడు మనిషి హేతువు కాంతిలో ఆలోచించకూడదు. అయితే గియితే అంటూ తన స్వంత అభిప్రాయాలను అన్వయింపజేసే ప్రయత్నాలు చేయకూడదు.

(٥٦) وَعَنْ صَفْوَانَ بْنِ عَسَّالٍ رضي الله تعالى عنه قَالَ: كَانَ النَّبِيُّ ﷺ يَأْمُرُنا إِذَا كُنَّا سَفراً أَن لاَّ نَنْزِعَ خِفَافَنَا ثَلاَثَةَ أَيَّامٍ ولَيَالِيَهُنَّ إِلاَّ مِنْ جَنَابَةٍ، وَلَكِنْ مِنْ غَائِطٍ وَبُولٍ وَنَوْمٍ. أَخْرَجَهُ النَّسَائِيُّ وَالتِّرْمِذِيُّ، وَاللَّفْظُ لَهُ، وَابْنُ خُزَيْمَةَ وَصَحَّحَاهُ.

56. హజ్రత్ సఫ్వాన్ బిన్ అస్సాల్ (రజి) వివరించారు : మేము ప్రయాణంలో ఉండగా - అశుద్ధావస్థకు లోనైతే తప్ప- మూడు పగళ్ళూ, మూడు రాత్రుల దాకా మేజోళ్లు విడువనవసరం లేదని దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) మమ్మల్ని ఆజ్ఞాపించేవారు. అయితే మలమూత్రాల విసర్జన దృష్ట్యా, నిద్ర కారణంగా వాటిని విడువవలసిన అవసరం లేదు." (నసాయి, తిర్మిజీలు దీనిని ఉల్లేఖించారు. హదీసు వాక్యాలు మాత్రం తిర్మిజీ నుండి తీసుకోబడ్డాయి. తిర్మిజీ, ఇబ్నె ఖుజైమాలిరువురూ దీనిని ప్రామాణికమైన ఉల్లేఖనంగా ధృవీకరించారు).

### సారాంశం

మేజోళ్లపై మసహ్ చేసే విషయంలో ఎలాంటి భేదాభిప్రాయాలకు తావులేదు. ఈ అంశాన్ని గురించి ఉల్లేఖించిన సహాబీల సంఖ్య 80కు చేరింది. స్వర్గలోక శుభవార్త పొందిన సహాబీలు కూడా వీరిలో ఉన్నారు.

అయితే మేజోళ్ల గడువు ప్రయాణీకులకు, స్థానికులకు వేర్వేరుగా నిర్ధారించబడి ఉంది. ప్రయాణీకులయితే మూడు రేయింబవళ్ల వరకూ మేజోళ్లు ధరించి ఉండవచ్చు. స్థానికులయితే ఒక పగలూ ఒక రేయి వరకూ తొడగవచ్చు. వుజూ భంగమయిన క్షణం నుంచీ గడువు మొదలవుతుంది. ఉదాహరణకు ఒక వ్యక్తి జుహ్ర్ నమాజ్ సమయంలో వుజూ చేసి మేజోళ్లు తొడిగాడు, అతని వుజూ సాయంత్రం భంగమైందనుకోండి, అతని గడువు సాయంత్రం నుండే మొదలవుతుంది. మనిషి అశుద్ధతకు లోనైన (తప్పనిసరిగా స్నానం చేయవలసిన అగత్యం ఏర్పడిన) కారణంగా మేజోళ్లు తీసినట్లయితే మసహ్ భంగమైనట్లే. అలాగే గడువు ముగిసిన మరుక్షణం నుంచే మసహ్ భంగమైపోతుంది.

## హదీసు ఉల్లేఖకులు

ఈయన పూర్తి పేరు సఫ్వాన్ బిన్ అస్సాల్ మురాదీ అల్ జుమలీ. ప్రముఖ సహాబీలలో ఒకరు. దైవప్రవక్త (సఅసం) సారథ్యంలో జరిగిన 12 యుద్ధాలలో ఈయన పాల్గొన్నారు. కూఫాలో స్థిరనివాస మేర్పరచుకున్నారు.

(٥٧) وعَنْ عَلِيٍّ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ قَالَ: جَعَلَ النَّبِيُّ ﷺ ثَلَاثَةَ أَيَّامٍ وَلَيَالِيَهُنَّ لِلْمُسَافِرِ، وَيَوْماً وَلَيْلَةً لِلْمُقِيمِ، يَعْنِي فِي الْمَسْحِ عَلَى الْخُفَّيْنِ. أَخْرَجَهُ مُسْلِمٌ.

57. హజ్రత్ అలీ (రజి) గారిచే ఇలా ఉల్లేఖించబడింది : "దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ప్రయాణీకుని కోసం మేజోళ్లపై మసహ్‌కై మూడు రేయింబవళ్ళను, స్థిర నివాసమున్న వానికై ఒక పగలూ రేయిని గడువుగా నిర్ధారించారు." (ముస్లిం)

(٥٨) وعَنْ ثَوْبَانَ رضي الله تعالى عنه قَالَ: بَعَثَ رَسُولُ اللهِ ﷺ سَرِيَّةً فَأَمَرَهُمْ أَنْ يَمْسَحُوا عَلَى العَصَائِبِ، يَعْنِي العَمَائِمَ، وَالتَّسَاخِينَ، يَعْنِي الخِفَافَ. رَوَاهُ أَحْمَدُ وَأَبُو دَاوُدَ، وَصَحَّحَهُ الْحَاكِمُ.

58. హజ్రత్ సోబాన్ (రజి) ఉల్లేఖించారు: "దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఒక సైనిక దళాన్ని పంపిస్తూ, తల పాగాలపై, మేజోళ్లపై 'మసహ్' చేయవలసిందిగా వారిని ఆదేశించారు." (అహ్మద్, అబూదావూద్‌లు దీనిని ఉల్లేఖించారు- హాకిమ్ దీనిని ప్రామాణికమైనదిగా ఖరారు చేశారు).

## సారాంశం

హదీసులో ప్రయోగించబడిన అరబీ పదాలకు మేజోళ్లు బదులు 'కట్లు, 'పట్టీలు' అన్న అర్థాలు వస్తాయి. కాళ్లను చలి తీవ్రత నుండి కాపాడటానికి ఉపయోగించే వస్తువు అన్నభావం కూడా వస్తుంది. అవి మేజోళ్లూ కావచ్చు, లేక మరే కట్లు అయినా కావచ్చు. కాళ్లకు తగిలిన గాయాలపై కట్టే పట్టీ (బ్యాండేజీ) కూడా కావచ్చు.

సైనిక బృందాన్ని యుద్ధానికి పంపిస్తూ దైవప్రవక్త (స) ఈ రకమయిన ఆజ్ఞలు జారీ చేశారంటే; క్షతగాత్రులైన యోధులు వుజూ భాగాలను మాటిమాటికీ కడిగేబదులు గాయాలపై కట్టబడి వున్న పట్టీలపై మసహ్ చేస్తే సరిపోతుంది అన్న భావం అయి ఉంటుంది.

## హదీసు ఉల్లేఖకులు

సౌబాన్ (రజి) గారి పూర్తి పేరు సోబాన్ బిన్ బుజ్దద్ బిన్ జహ్‌దర్. మారుపేరు అబూ అబ్దుల్లాహ్. ఈయన 'సురాత్' కు చెందిన వారు. అది మక్కా-మదీనాల మధ్య ఉన్న ఒక స్థలం. హుమైర్ తెగకు చెందినవారన్న వాదన కూడా ఉంది. ప్రయాణావస్థలోనూ, సాధారణ

సమయాలలోనూ ఈయన - జీవితాంతం - దైవప్రవక్త (సఅసం)కు వెన్నంటి ఉండేవారు. అన్ని రకాల సేవలు అందించేవారు. దైవప్రవక్త (సఅసం) ఈయన్ని కొని బానిసత్వం నుండి విముక్తి కలిగించారు. దైవప్రవక్త (స) మరణించిన పిదప ఈయన సిరియాలో స్థిరనివాసమేర్పరచుకున్నారు. కొన్నాళ్ల తర్వాత హిమ్స్ వైపునకు పయన మయ్యారు. హిజ్రీ 54లో కన్నుమూశారు.

(٥٩) وعَنْ عُمَرَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ مَوْقُوفاً، وأنسٍ مَرْفوعاً: «إِذَا تَوَضَّأَ أَحَدُكُمْ وَلَبِسَ خُفَّيْهِ فَلْيَمْسَحْ عَلَيْهِمَا، وَلْيُصَلِّ فِيهِمَا، وَلاَ يَخْلَعْهُمَا إِنْ شَاءَ إِلاَّ مِنْ جَنَابَةٍ». أَخْرَجَهُ الدَّارَقُطْنِيُّ وَالْحَاكِمُ وَصَحَّحَهُ.

59. హజ్రత్ ఉమర్ (రజి) చే గుర్తింపు పొందనిది (మౌఖూఫ్) గానూ, హజ్రత్ అనస్ (రజి)చే గుర్తింపు పొందినది (మర్ఫూ)గానూ ఉల్లేఖించబడిన హదీసు లో ఇలా అనబడింది:

“మీలో ఎవరయినా మేజోళ్లు ధరించి ‘వుజూ’ చేస్తే వాటిపై మసహ్ చేసుకో వచ్చు. వాటిని ధరించి వున్న స్థితిలోనే నమాజ్ చేయవచ్చు. విధిగా స్నానం చేయవలసిన స్థితికి లోనైతే తప్ప వాటిని తీయవలసిన అవసరం లేదు.” దారె ఖుత్నీ దీనిని ఉల్లేఖించారు. హాకిమ్ దీని ప్రామాణికతను ధృవీకరించారు).

(٦٠) وعَنْ أَبِي بَكْرَةَ رَضِي الله تعالى عنه عَنِ النَّبِيِّ ﷺ، أَنَّهُ رَخَّصَ لِلْمُسَافِرِ ثَلاَثَةَ أَيَّامٍ وَلَيَالِيَهُنَّ، وَلِلْمُقِيمِ يَوْماً ولَيْلَةً، إِذَا تَطَهَّرَ فَلَبِسَ خُفَّيْهِ، أَنْ يَمْسَحَ عَلَيْهِمَا. أَخْرَجَهُ الدَّارَقُطْنِيُّ وَصَحَّحَهُ ابْنُ خُزَيْمَةَ.

60. దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ప్రవచించినట్లు హజ్రత్ అబూ బక్ర (రజి) వివరించారు - ఆయన (స) బాటసారి కోసం (మసహ్ నిమిత్తం) మూడు రేయింబవళ్ల సౌకర్యం ఇచ్చారు. బాటసారి కాని వారికి ఒక పగలూ, ఒక రాత్రి సౌలభ్యం ఇచ్చారు. అయితే వుజూ చేసి వున్న స్థితిలో మేజోళ్లు తొడిగితేనే ఇలా మసహ్ చేయవచ్చు.” (దారె ఖుత్నీ దీనిని ఉల్లేఖించగా, ఇబ్నె ఖుజైమ దీనిని ప్రామాణికమైన ఉల్లేఖనంగా ఖరారు చేశారు).

## హదీసు ఉల్లేఖకులు

హదీసు ఉల్లేఖకులైన అబూ బక్ర (రజి) అసలు పేరు నుఫై బిన్ హారిస్. ఈయన తాయఫ్ కోట నుంచి కొంతమంది యువకులతో బయటకు వచ్చి ఇస్లాం స్వీకరించారు. దైవప్రవక్త (సఅసం) ఈయనకు స్వేచ్ఛనొసగారు. బుద్ధిజీవులలో ఒకరుగా పరిగణించబడ్డారు. హిజ్రీ 51 లేదా హిజ్రీ 52లో బస్రాలో కన్నుమూశారు. అధిక సంతానం కలవారు.

61. హజ్రత్ ఉబై బిన్ ఇమార (రజి) వివరించారు : 'ఓ దైవ ప్రవక్తా! నేను మేజోళ్ల పై మసహ్ చేయగలనా?' అని ప్రశ్నించాను. "అవును, చేసుకోవచ్చు" అని ఆయన (స) జవాబిచ్చారు. 'ఒక రోజా?' అని నేను అడగ్గా "అవును, ఒక రోజు" అని ఆయన (స) బదులిచ్చారు. 'రెండు రోజులు?'అని విన్నవించుకోగా, "అవును, రెండు రోజులు" అని సెలవిచ్చారు. 'మూడు రోజులు కూడానా?' అని నేను ప్రశ్నించగా "అవును, మూడు రోజులు. నీ కిష్టమొచ్చినంత కాలం" అని ఆయన (స) పలికారు. (అబూ దావూద్ ఈ హదీసును ఉల్లేఖించారు. అయితే ఇది దృఢమైనది కాదు అని ఆయన అభిప్రాయపడ్డారు).

(٦١) وعَنْ أُبَيِّ بْنِ عِمَارَةَ رَضِيَ اللّٰهُ تَعَالَى عَنْهُ أَنَّهُ قَالَ: يَا رَسُولَ اللهِ! أَمْسَحُ عَلَى الْخُفَّيْنِ؟ قَالَ: نَعَمْ، قَالَ: يَوْماً؟ قَالَ: نَعَمْ، قَالَ: وَيَوْمَيْنِ؟ قَالَ: نَعَمْ، قَالَ: وَثَلَاثَةَ أَيَّامٍ؟ قَالَ: نَعَمْ، وَمَا شِئْتَ. أَخْرَجَهُ أَبُو دَاوُدَ، وَقَالَ: لَيْسَ بِالْقَوِيِّ.

## సారాంశం

ఈ హదీసు బలహీనమైనది. పైగా ఇది ఇంతకు ముందు గడువును సూచించిన రెండు ప్రామాణికమైన హదీసులకు విరుద్ధంగా ఉంది. బాటసారి కోసం మూడు రేయింబవళ్లు, బాటసారి కాని వ్యక్తికి ఒక పగలు రేయి మసహ్ చేసే గడువుగా లోగడ వచ్చిన ప్రామాణిక హదీసులలో నిర్ధారించబడింది. దృఢమైన, ప్రామాణికమైన హదీసుల ముందు బలహీనమైన హదీసు ఉపేక్షించబడుతుంది. ఈ హదీసు చాలా బలహీనమైందన్న విషయంపై హదీసువేత్తలంతా ఏకీభవించినట్లు ఇమామ్ నవవీ (రహ్మ.లై) 'షర్హుల్ ముహజ్జిబ్' లో పేర్కొన్నారు.

## హదీసు ఉల్లేఖకులు

ఉబై బిన్ ఇమార (రజి) మదీనాకు చెందిన అన్సార్లలో సుప్రసిద్ధులు. ఈజిప్టులో స్థిరపడ్డారు.

రెండు ఖిబ్లాల (బైతుల్ మఖ్దిస్, బైతుల్లాహ్)కు అభిముఖమై నమాజ్ చేసిన భాగ్యం పొందిన వారిలో ఈయన కూడా ఉన్నారని ఇబ్నె హిబ్బాన్ పలికారు. అయితే ఈ హదీసుపై, దీని ప్రామాణికతపై తనకు నమ్మకం లేదని కూడా ఆయన నొక్కి పలికారు.